క్లుప్తంగా

నేడు తర్లుపాడులో వైఎస్సార్ సీపీ రచ్చబండ

తర్లుపాడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన తర్లుపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యుడు, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబుతోపాటు పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలు పొందాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ శ్రీచందన, ఇతర అధికారులు

మార్కాపురం: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రజలు పొందాలని మార్కాపురం ఆర్డీఓ శ్రీచందన పేర్కొన్నారు. గురువారం జీఎస్టీ పన్నుల తగ్గింపుపై రవాణాశాఖ, కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతాయని ఆర్డీఓ పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు, మందులు, బైకులు, కార్లపై, మోటారు వెహికిల్స్‌పై భారీ స్థాయిలో జీఎస్టీ తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో సీటీఓ నరసింహారావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరునికి ఇత్తడి తొడుగు బహూకరణ



ఇత్తడి తొడుగు అలంకరణలో శివలింగం

కొనకనమిట్ల: మండలంలోని ఎదుర్రాళ్లపాడు సంగమేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి గ్రామానికి చెందిన బొరిగొర్ల కాశయ్య, సాయమ్మ దంపతులు ఇత్తడి తొడుగు బహూకరించినట్లు ఆలయ అర్చకుడు విజయకాంత్ శర్మ తెలిపారు. గురువారం సంగమేశ్వరస్వామికి ఇత్తడి తొడుగు అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దాతలు పట్టువస్త్రాలు సమర్పించి అర్చనలు, అభిషేకాలు చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- పీపీపీ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు
- మార్కాపురం టౌన్, బోడపాడులలో కోటి సంతకాల సేకరణ
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జంకె, వెన్నా తదితరులు

మార్కాపురం/మార్కాపురం టౌన్:

మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, పీపీపీ విధానం పేరుతో జారీ చేసిన జీవోలను రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. గురువారం మార్కాపురం మండలంలోని బోడపాడు, పట్టణంలోని కాలేజీ రోడ్డులో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంటు పరిశీలకులు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కె.ఆదెన్న, పార్టీ స్టేట్ కమిటీ సభ్యులు వెన్నా హనుమారెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఉదయం బోడపాడు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయనంత అభివృద్ధిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపారని గుర్తు చేశారు. ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించిన ఘనత కూడా వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని పేద ప్రజలకు ఉచితంగా అందించేందుకు, వైద్య విద్య అభ్యసించే అవకాశాన్ని అర్హులైన విద్యార్థులకు కల్పించేందుకు మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాల మంజూరు చేశారని, అయితే వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మరో మెడికల్ కళాశాలను మంజూరు చేశారని పేర్కొన్నారు. సుమారు 70 శాతానికిపైగా పూర్తయిన మార్కాపురం కళాశాలను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇది పార్టీలకతీతంగా జరుగుతున్న కార్యక్రమమని ప్రజలందరూ స్వచ్ఛందంగా వచ్చి కోటి సంతకాల సేకరణలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించే విధంగా ఒత్తిడి తెచ్చేందుకు, పార్టీలతో సంబంధం లేకుండా వైఎస్సార్ సీపీ ఉద్యమం చేపట్టిందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వమే రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను నిర్మించాలని, ప్రైవేటుపరం చేసే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటుపరం చేస్తే మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు దక్కడం కష్టమని, నాణ్యమైన విద్య కూడా పేద ప్రజలకు దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు చెంచిరెడ్డి, సలీమ్, మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులైన సర్పంచ్ రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, పార్టీ నాయకులు బొగ్గు రవిచెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, జంకె చిన్న వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, దండా వెంకటేశ్వరరెడ్డి, శివరాంపురం సర్పంచ్ గురుబ్రహ్మం, శ్రీరాములు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, సిరాజ్, కొత్త కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు వనజాక్షి, ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జిలు రోజ్‌లిడియా, పోరుమామిళ్ల విజయలక్ష్మి, డాక్టర్ మక్బుల్ బాషా, గౌస్ మొహిద్దీన్, మౌలాలీ, ఆసిఫ్‌ఖాన్, డి వెంకటేశ్వర్లు, రంగస్వామి గౌడ్, బచ్చు సుబ్రమణ్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోడపాడులో ర్యాలీలో పాల్గొన్న అన్నా, జంకె, ఆదెన్న, వెన్నా తదితరులు



బోడపాడులో కోటి సంతకాల కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు



మార్కాపురంలో పీపీపీ విధానానికి వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న అన్నా రాంబాబు, నాయకులు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన షంషేర్ ఆలీబేగ్, నాయకులు

ప్రమాదాల నిలయం కొండేపల్లి మార్గం



నాలుగు రోజుల క్రితం ప్రమాదానికి గురైన చెట్ల మధ్య ఉన్న ఆటో

- తరచూ రోడ్డు ప్రమాదాలతో జనం బెంబేలు
- బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల రాకపోకలు



రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు

మార్కాపురం: మార్కాపురం నుంచి శివరాంపురం, కొండేపల్లి, అమ్మవారిపల్లి మీదుగా వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోజూ కొండేపల్లి, అమ్మవారిపల్లి, శివరాంపురం గ్రామాల నుంచి సుమారు 100 మందికి పైగా విద్యార్థులు, 2 వేల మందికి పైగా ప్రజలు మార్కాపురం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మూడు గ్రామాలకు సంబంధించి సుమారు 50 ఆటోలు రోజూ మార్కాపురం పట్టణం నుంచి శివరాంపురం మీదుగా కొండేపల్లి వెళ్తుంటాయి. మరో 200 వరకు టూవీలర్లు ఇదే మార్గంలో తిరుగుతుంటాయి. సుమారు ఆరు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డులో మూలమలుపులను చిల్లచెట్లు మూసివేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు సక్రమంగా కనిపించక అయోమయానికి గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఆటో–టూవీలర్ పరస్పరం ఢీకొనడంతో శివరాంపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించలేదని గ్రామ సర్పంచ్ గురుబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలగించి, ప్రమాదాలను నివారించాలని సర్పంచ్‌తోపాటు ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ గో బ్యాక్

- విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు
- నిరసన ప్రదర్శనలో కమ్యూనిస్టు నాయకుల ధ్వజం



నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: విభజన చట్టంలో హామీలు అమలు చేయని ప్రధాని మోదీ గో బ్యాక్ అంటూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మార్కాపురంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య, సీపీఐ సీనియర్ నాయకులు అందె నాసరయ్య మాట్లాడుతూ.. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా రాష్ట్రానికి ప్రధాని రావడం సరికాదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంటుకు నిధులు, గనుల కేటాయింపు, కడపలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు తదితర హామీలు అమలు చేయకుండా మోదీ రాష్ట్రంలో ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. రాజధాని అమరావతికి నిధులు ఇస్తామని చెప్పి వేల కోట్ల రూపాయల అప్పులివ్వడం సరికాదని ఆక్షేపించారు. పోలవరం ప్రాజెక్టును వెంటనే పూర్తిచేసి ముంపు గ్రామాల వారికి పునరావాస పనులు పూర్తిచేయాలన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు డీకేఎం రఫీ, ఎస్కే నన్నేసా, సురేష్, జనుమాల నాగయ్య, గాలి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



గిద్దలూరులో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భూసార పరీక్షలపై విద్యార్థులకు గురువారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఏడీఏ కె.రాజేశ్వరి మాట్లాడుతూ.. భూసార పరీక్షలు నమూనా సేకరణ ప్రయోజనాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేలలో ఉన్న సహజ పోషకాల స్థాయి తెలుసుకుని పంటలకు అనువైన ఎరువుల వాడాల్సి ఉంటుందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం భూసార పరీక్షల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు భూసార పరీక్ష కేంద్రం ఏఓ డి.స్వరూప పాల్గొని మట్టి నమూనాల సేకరణ, పరీక్షా విధానం, మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ శేషమ్మ, భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ సుచరిత, డీఆర్సీ ఏఓ శైలజా రాణి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కంభంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

గొట్లగట్టులో ట్రాఫిక్ ఝుంజాటం





ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

కొనకనమిట్ల: ఒంగోలు–కర్నూలు హైవేపై కొనకనమిట్ల మండలం గొట్లగట్టు మేజర్ పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ కష్టాలు వాహనదారులను తీవ్ర అసహనానికి గురిచేస్తున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఒక వైపు కాంక్రీట్ పనులు చేశారు. మరో వైపు మార్జిన్ సక్రమంగా లేకపోవటం, రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. వాహనాలు ఎదురుపడినప్పుడు అధిక సమయం నిలిచిపోతున్నాయి. దీనికి తోడు రోడ్డు మార్జిన్‌లో ఆటోలు, బైక్‌లు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులతోపాటు స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. త్వరగా రహదారి విస్తరణ పనులు పూర్తి చేసి రెండు వైపుల మార్జిన్‌లు సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం

- తువ్వపాడులో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

కొనకనమిట్ల: ప్లాస్టిక్ వినియోగానికి ప్రతి ఒక్కరూ స్వస్తి పలికి అందుకనుగునంగా గుడ్డ సంచులను వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మండల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని తువ్వపాడు పంచాయతీలో పర్యటించి గ్రామంలో చేయాల్సిన పలు పనులపై స్పందించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను మరమ్మతులు చేయించి వాడకంలోకి తేవాలని కార్యదర్శికి సూచించారు. సోర్స్ లెవెల్లో సెగ్రిగేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని క్లాప్‌మిత్రకు సూచించారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులు ముద్దు అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సీ కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న ఖాళీ స్థలాలు



ఎస్సీ కాలనీ వద్ద ఖాళీ స్థలంలో మురుగు



బేస్తవారిపేటలో ఎస్సీ కాలనీ చుట్టూ మురుగు చేరి ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



బేస్తవారిపేటలో రెడ్డినగర్ నివాస గృహాల పక్కన దుస్థితి

- నిత్యం నీటితో నిండిపోతున్న వైనం
- దోమలు, విష సర్పాలకు ఆవాసం
- భయాందోళనలో స్థానికులు

బేస్తవారిపేట: ఖాళీ స్థలాల్లోకి వర్షం నీరు, మురుగు నిల్వ చేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. నీరు బయటకుపోయే మార్గం లేకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతున్నాయి. జమ్ము దట్టంగా పెరగడంతో విష సర్పాలు ఆవాసం ఏర్పరుచుకుంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బేస్తవారిపేటలోని రెడ్డినగర్, ఇస్లాంపేట, జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని ఎస్సీ కాలనీ చుట్టూ, పాత జేజీఎం పాఠశాల సమీపంలో, కొమరోలు మండలంలోని బ్రహ్మంగారిమఠం వీధి, సినిమా హాల్ వీధి, పురుషోత్తంపల్లె రోడ్డు, రహమత్ నగర్, కంభం మండలంలో అర్బన్ కాలనీ, కందులాపురంలోని రావిపాడు రోడ్డు, కందులాపురం కాలనీ, కందులాపురం రామాలయం, భాగ్యనగర్‌కాలనీ, బస్టాండ్ వెనుక వీధి మురుగు తటాకాలను తలపిస్తున్నాయి. చీకటి పడిన తర్వాత బయటకు రావాలంటేనే స్థానికులు భయపడుతున్న పరిస్థితి.

రోగాలు ప్రబలే ప్రమాదం

ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు మెరక చేయకుండా ఖాళీగా వదిలివేస్తున్నారు. కనీసం ఆ స్థలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడమే కాకుండా, మురుగు పేరుకుపోయి దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయి. దోమలు విజృంభిస్తుండటంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా నిత్యం నీరు నిల్వ ఉండటంతో చుట్టుపక్కల నివాసాల ప్రజలు దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

పోషకాహారంతో స్థూలకాయం నివారణ



పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తున్న అధికారులు

అర్ధవీడు: స్థూలకాయం బారిన పడిన వారు సమతుల పోషకాహారం తీసుకోవడం ద్వారా సమస్య నుంచి బయటపడవచ్చని ఎంఈఓ ఇంకొల్లు సుజాత, ఎంపీడీఓ షేక్ ఖాశింపీరా పేర్కొన్నారు. గురువారం అర్ధవీడులోని ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.రమీజాబీ ఆధ్వర్యంలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోషక ఆహారం తీసుకోవాలని, 8 గంటలు నిద్రపోవడంతో పాటు వ్యాయామం చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు జంక్ ఫుడ్స్ ఇవ్వకుండా దేశీ పంట ఉత్పత్తులతో తయారుచేసిన పదార్థాలు ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, పీవీ సుబ్బమ్మ, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.